క్లుప్తంగా

ప్రజలకు మజ్జిగ పంపిణీ



చలివేంద్రాన్ని ప్రారంభించిన మాజీ ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: వేసవిలో ప్రజలు, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని ఊర్వశి థియేటర్ సెంటర్‌లో మార్గాని భరత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ కట్టడంపై చర్యలు తీసుకోవాలి



కమిషనర్ కేతన్ గార్గ్‌కు సమస్యను వివరిస్తున్న అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని గౌతమీ సూపర్ బజార్ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా మూడు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారని, దాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు శుక్రవారం కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయనను నగర పాలక సంస్థ కార్యాలయంలో కలిసి పరిస్థితిని వివరించారు. అలాగే 10వ డివిజన్ యు జంక్షన్‌లో రోడ్డు మీద అనుమతులు లేకుండా విగ్రహాలను పెడుతున్నారన్నారు. వినతి పత్రాన్ని పరిశీలించిన కమిషనర్.. నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేషన్ పరిధిలో నిర్మించే కట్టడాలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని అప్పారావు తెలిపారు. ఆయన వెంట సీరపు గణేష్ రెడ్డి ఉన్నారు.

కార్యదర్శులకు అభినందనలు



పదోన్నతులు పొందిన కార్యదర్శులను అభినందిస్తున్న ఎంపీపీ సత్యప్రసాద్ తదితరులు

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో సేవలందిస్తూ గ్రేడ్ 5 కార్యదర్శులుగా పదోన్నతులు పొందిన మర్రి కాశీవిశ్వనాథ్, దూడల రాఘవ, ఆకుల జగదీష్, జి.సుబ్రహ్మణ్యం, కె.ప్రతాప్, చింతా యమునలను ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఎంపీడీవో కె.రమేష్ శుక్రవారం అభినందించారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పంతం గణపతి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవాలి

కడియం: పాకిస్తాన్‌తో నెలకొన్న యుద్ధం నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందికి మాక్ డ్రిల్ నిర్వహించారు. అన్ని పరిస్థితులను ఎదుర్కొవడానికి సిబ్బంది అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.మాధురి మాట్లాడుతూ పరికరాలు, మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎటువంటి పరిస్థితి తలెత్తినా సేవలందించేందుకు సమాయత్తమై ఉండాలన్నారు. స్టెమి అవగాహన, గుండెపోటు లక్షణాలు గుర్తించడం, మరణాలను తగ్గించడం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎం.మణిజ్యోత్స్న, ఎల్.మోహనవంశీ, ఎన్.నాగసాయిమౌర్య, సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో మోసం

కంబాలచెరువు: పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి మహిళను మోసం చేసిన వ్యక్తిపై ఏలూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనికి సంబంధించిన వివరాలను వన్ టౌన్ పోలీసులు శుక్రవారం తెలిపారు. ఏలూరుకు చెందిన రాధా రుక్మిణికి వివాహం కాగా.. ఐదేళ్ల క్రితం భార్యాభర్తలు విడిపోయారు. ఆమె పిల్లలతో విడిగా ఉంటోంది. ఆమెకు జోడీ యాప్‌లో రాజమహేంద్రవరంలోని రాజేంద్రనగర్‌కు చెందిన శ్యామ్‌కుమార్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఈ నెల 2వ తేదీన రాజమహేంద్రవరం వచ్చింది. అయితే శ్యామ్ కుమార్ తనను పెళ్లిచేసుకుంటానని చెప్పి రూమ్‌కు తీసుకెళ్లి శారీరకంగా అనుభవించి మోసం చేశాడని పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. ఏలూరు పోలీసులు రాజమహేంద్రవరం పోలీస్ స్టేషన్‌కు కేసు అందించగా, పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో పడి వ్యక్తి మృతి

గోదావరిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బొమ్మూరులోని వృద్ధాశ్రమంలో ఉండే నాగేశ్వరరావు (55) ఈ నెల 2వ తేదీన ఆశ్రమం నుంచి వచ్చేశాడు. పుష్కర ఘాట్‌కు వచ్చిన నాగేశ్వరరావు ప్రమాదవశాత్తూ గోదావరిలో పడి మృతి చెందాడు.

వేసవి క్రీడా సంబరం

- ఉత్సాహంగా శిబిరాలు
- తరలివచ్చిన చిన్నారులు
- మైదానాల్లో కోలాహలం
- పలు క్రీడల్లో శిక్షణ

ప్రకాశం నగర్: వేసవి సెలవులు కావడంతో విద్యార్థులకు పుస్తకాలకు బైబై చెప్పేశారు. ఆటలతో ఉత్సాహంగా కాలం గడుపుతున్నారు. తమకు ఇష్టమైన క్రీడలో మెళకువలు నేర్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు సందడిగా మారాయి. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో ఎస్‌కేవీటీ క్రీడా మైదానం, ఆర్ట్స్ కళాశాల, లాలాచెరువు, డీఎంహెచ్ స్కూల్ క్రీడా మైదానాల్లో శిబిరాలు ఏర్పాటు చేశారు. ఒక్కో సెంటర్ నుంచి కనీసం 25 మంది బాలురు, 25 మంది బాలికలకు క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు.

నచ్చిన క్రీడలో..

శిబిరాలలో సుమారు 8 ఏళ్ల నుంచి 14 ఏళ్ల వయసున్న పిల్లలు క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, ఖోఖో, హాకీ, కబడ్డీ, హ్యాండ్ బాల్, టెన్నిస్, యోగా, బాక్సింగ్, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. జిల్లా క్రీడా అసోసియేషన్లు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు ఆయా శిబిరాల్లో ముఖ్య భూమిక పోషిస్తున్నారు. మే ఒకటిన ప్రారంభమైన శిక్షణ 31 వరకూ జరుగుతుంది. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ పరిధిలో మొత్తం 50 సెంటర్లు నిర్వహిస్తున్నట్టు జిల్లా ముఖ్య క్రీడాశిక్షకులు డీఎంఎం శేషగిరి తెలిపారు.

జిల్లా పోలీస్ క్రీడా మైదానంలో..

జిల్లా పోలీస్ కార్యాలయంలోని మైదానంలో చిన్నారుల వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఇటీవల ప్రారంభించారు. ఉదయం 6 నుంచి 8 వరకూ, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు జరిగే ఈ శిక్షణ శిబిరంలో షటిల్, టెన్నిస్, క్రికెట్, వాలీబాల్, యోగా వంటి క్రీడా అంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు పీటీ, కోచ్‌లను ప్రత్యేకంగా నియమించారు. శిబిరానికి వచ్చే చిన్నారులకు నిత్యం పోషక విలువలు గల రాగి జావ, కోడి గుడ్డు, అరటి పండు ఇస్తున్నారు.



చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్



బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలి. క్రీడల్లో ప్రతిభ కనబరించేందుకు ఇటువంటి శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయి. క్రీడాకారులు తమకు నచ్చిన ఆటలో శిక్షణ పొదడం, ఆటలో మెలకువలు నేర్చుకునేందుకు ఇదో చక్కటి అవకాశం.

– డీఎంఎం శేషగిరి, జిల్లా చీఫ్ కోచ్

అపరిచితులతో స్నేహం ప్రమాదకరం

కంబాలచెరువు: సామాజిక మాధ్యమాల్లో అపరిచితులతో స్నేహం ప్రమాదకరమని, వాటి వల్లే మానవ అక్రమ రవాణా జరుగుతోందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి అన్నారు. మానవ అక్రమ రవాణా, తప్పిపోయిన, ఆచూకీ తెలియని పిల్లల కేసులకు సంబంధించి శుక్రవారం స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో అధికారులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబ సభ్యుల మధ్య ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటే ఇలాంటి నేరాలు తగ్గుతాయన్నారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తప్పిపోయిన, ఆచూకీ తెలియని పిల్లలు, అక్రమ రవాణా గురవుతున్న బాధితులను కాపాడేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. నల్సా వారి అక్రమ రవాణా బాధితులు, వాణిజ్య పరమైన లైంగిక దోపిడీ బాధితుల పథకం 2015 ద్వారా అందిస్తున్న సేవలను తెలిపారు. అలాంటి కేసులకు సంబంధించి ఉచిత న్యాయ సహాయానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ కేవీవీ సత్యనారాయణ జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవ రావు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బీఎస్ఎన్ఎస్ వల్లి, చైల్డ్ వెల్ఫేర్ కమిషనర్ పి.సూర్యప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం

- ఆ పనులను ఎందుకు ఆపడం లేదు
- సిటీ ఎమ్మెల్యే తీరు వెనుక మర్మమేమిటి!
- సవాల్ విసిరినా స్పందించలేదెందుకు!
- మాజీ ఎంపీ భరత్ రామ్ ధ్వజం



గౌతమీ సూపర్ బజార్ స్థలంలో ఆందోళన చేస్తున్న మాజీ ఎంపీ భరత్ రామ్ (ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ: గౌతమీ సూపర్ బజార్ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న మూడు అంతస్తుల భవన నిర్మాణాన్ని సిటీ ఎమ్మెల్యే ఎందుకు ఆపడం లేదని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ ప్రశ్నించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పనిచేస్తే, ఎంపీగా ఉన్న తనపై ఇష్టం వచ్చినట్లు అవినీతి ఆరోపణలు గుప్పించారన్నారు. వాటిలో సూపర్ బజార్ స్థలం లీజు విషయంలో రూ.ఐదు కోట్ల ముడుపులు ఇచ్చినట్లు ఆరోపణ చేశారన్నారు. అప్పుడు అవినీతి ఆరోపణలు చేసిన ప్రస్తుత ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు.. ఇప్పుడు అక్కడ భవన నిర్మాణాన్ని ఎందుకు ఆపడం లేదని నిలదీశారు. అవినీతిని నిరూపించి, వాస్తవాలు ఏమిటో తేల్చాలని సవాల్ చేసినా స్పందించకుండా ఏదేదో మాట్లాడడం సరికాదన్నారు.

ముడుపులు ఎవరికి దక్కాయో..

భరత్ రామ్ మాట్లాడుతూ రూ.ఐదు కోట్లు తనకు ముడుపులు ఇచ్చినట్లు అప్పట్లో ఆరోపించి, కరపత్రాలు వేసి, నానా అల్లరి చేశారన్నారు. మరి ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉండి కూడా నిర్మాణం ఆపడం లేదంటే, ఆ ముడుపులు ఎవరికి దక్కిందనే విషయం స్పష్టం చేయాలన్నారు. అసలు అక్కడ నిర్మాణమే పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా ఉందని ధ్వజమెత్తారు. గౌతమీ సూపర్ బజార్ స్థలంలో శాశ్వత ప్రాతిపదికన నిర్మాణం చేయకూడదన్న నిబంధనను ఉల్లఘించారని, ప్లాన్ అప్రూవల్ కోసం సూపర్ బజార్ పక్షాన మున్సిపాల్టీకి దరఖాస్తు చేయాల్సి ఉండగా, కాంట్రాక్టర్ నేరుగా దరఖాస్తు చేశారన్నారు. నాలుగు వైపులా పది అడుగుల స్థలం వదిలి నిర్మాణం చేయాల్సి ఉండగా అది జరగడం లేదన్నారు. ఇన్ని రకాలుగా నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణం సాగిస్తుంటే, ఎమ్మెల్యే ఏం చేస్తున్నారో తెలియడం లేదన్నారు.

అంతా విడ్డూరం

నగర నడిబొడ్డులో విలువైన స్థలం అన్యాక్రాంతం అయిందని ఇదే ఎమ్మెల్యే గతంలో గగ్గోలుపెట్టి, ఇప్పుడు నిలుపుదల చేయకుండా కాంట్రాక్టర్ హైకోర్టుకి వెళ్లారని చెప్పి తప్పించుకోవడం విడ్డూరంగా ఉందని భరత్ రామ్ అన్నారు. 51 ఎంక్వైరీలో ఉన్నపుడు గవర్నమెంట్ ప్లీడర్ ద్వారా హైకోర్టులో కౌంటర్ ఫైల్ చేసి, నిర్మాణం ఆపించే చర్యలు ఎందుకు చేపట్టడం లేదో ఎమ్మెల్యే చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో తామే ఇంప్లీడ్ అవుతామని, ఎమ్మెల్యేని పార్టీ చేస్తామని తెలిపారు.

యథేచ్ఛగా ఇసుక డ్రెడ్జింగ్

సిటీ ఎమ్మెల్యే వాసు గోదావరిలో ఇసుకను యథేచ్ఛగా డ్రెడ్జింగ్ చేస్తున్నాడని, దీనివల్ల మత్స్య సంపద అంతరించి పోయే ప్రమాదం ఉందని భరత్‌రామ్ అన్నారు. దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్లామని, పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ కింద కేసు వేస్తానన్నారు. ఇలా డ్రెడ్జింగ్ చేయడం వలన బ్రిడ్జికి కూడా ప్రమాదం పొంచి ఉందని అందరూ చెబుతున్నా ఆపకపోవడం శోచనీయమన్నారు. గోదావరి నీరు కలుషితమవుతోందని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తే, తనపై కేసు పెట్టించాడన్నారు.

● గాలివాన బీభత్సం



దుళ్ల బైపాస్ రోడ్డులో కూలిపోయిన విద్యుత్ స్తంభం, చెట్టు

కడియం: మండలంలో శుక్రవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించడంతో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. దుళ్ల బైపాస్ రోడ్డులోని హైటెన్షన్ వైర్లుతో ఉన్న స్తంభం కూలిపోయింది. దీంతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నర్సరీలలోని మొక్కలు నేలకొరిగాయి. మండలంలో ఇంకా 20 శాతానికి పైగా వరికోతలు జరగాల్సి ఉంది. కోతలు పూర్తయిన చోట ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది.

గర్భిణులకు వైద్య పరీక్షలు

కంబాలచెరువు: ప్రధానమంత్రి సురక్ష మాత అభయ్ (పీఎంఎస్ఎంఏ) పథకంలో భాగంగా కంబాలపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కమ్యూనిటీ పారామెడిక్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మల్లాది అనూహ్య.. గర్భిణులకు గ్లూకోన్ డి ప్యాకెట్లు, బిస్కెట్లు, మజ్జిగ అందించారు. విశ్రాంత ఆరోగ్యాధికారి డాక్టర్ ఎంవీఆర్ మూర్తి, జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, రాజమండ్రి అధ్యక్షులు రహమాన్‌ఖాన్, కార్యదర్శి మట్టా రమేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలనకు కమిటీ ఏర్పాటు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) పరిధిలో అభివృద్ధి పనుల పరిశీలనకు కమిటీని ఏర్పాటు చేసినట్లు వైస్ చైర్మన్ కేతన్ గార్గ్ తెలిపారు. గోదావరి పరిసర ప్రాంతాల అభివృద్ధి, సుందరీకరణ తదితర అంశాలపై శుక్రవారం రుడా కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుడా పరిధిలోని అర్బన్ లోకల్ బాడీస్, పంచాయతీల నుంచి వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించేందుకు వైస్ చైర్మన్ అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు, ఇతర ప్రైవేట్ వ్యక్తుల నుంచి భూసమీకరణ పథకం ద్వారా భూమిని సేకరించి, రెసిడెన్షియల్ లేఅవుట్ల అభివృద్ధి, హెల్త్ హబ్స్, టూరిజం ప్రాజెక్టులను చేపట్టడంపై చర్చ నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో రుడా సెక్రటరీ ఎంవీఆర్ సాయిబాబా, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ జీవీఎస్ఎన్ మూర్తి, ఈఈ నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అక్కినేని వనజ

ప్రకాశం నగర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్లక్ష్యం వహిస్తున్నారని, వెంటనే వాటిని అమలు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రానికి అప్పులున్నాయని తెలిసి కూడా, ఎన్నికల సమయంలో చంద్రబాబు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చారన్నారు. ప్రతి ఒక్కరికి ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మే 7వ తేదీ అర్ధరాత్రి త్రివిధ దళాల ఆధ్వర్యంలో భారత సైనికులు.. పాక్ ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ నిర్వహించి సుమారు 100 మంది ఉగ్రవాదుల్ని అంతం చేయడాన్ని సీపీఐ అభినందిస్తుందన్నారు. ప్రపంచ చరిత్రలో రాజధాని ప్రారంభించిన తర్వాత మళ్లీ పునఃప్రారంభించడం ఎక్కడా చూడలేదన్నారు. ఆ ఘనత మన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రిలకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరో 44 వేల ఎకరాలను అమరావతి రాజధాని నిర్మాణం కోసం తీసుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'ఓపెన్ ఫోరం'



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ప్రతి శుక్రవారం ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కేతన్ గార్గ్ ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేషన్‌లో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం జరిపారు. ఆయన మాట్లాడుతూ లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం, బిల్డింగ్ పెనలైజేషన్ స్కీంతో పాటు టౌన్ ప్లానింగ్ విభాగంలో అపరిష్కృత సమస్యలపై అభ్యంతరాలు ఉంటే ఆ రోజున ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. ఈ మేరకు అధికారులు, ప్లానింగ్ సెక్రటరీలు ప్రతి రోజూ టెలికాన్ఫరెన్స్‌ను తప్పనిసరిగా ఫాలో అవ్వాలన్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్లు పెండింగ్ ఉండకూడదన్నారు. అలాగే భాస్కర్ నగర్‌లో జరుగుతున్న సర్వేపై సంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలో ఆక్రమణలు తొలగించే కార్యక్రమం నిత్యం జరగాలని, లేకపోతే ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందన్నారు. అనధికార ఫ్లెక్సీలు, బోర్డులను తక్షణమే తొలగించాలన్నారు. ప్లానింగ్ సెక్రటరీలు విధులలో ఏమాత్రం అలసత్వం వహించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో సీపీ కోటయ్య, ఏసీపీలు, టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు, ఇతర సిబ్బంది, పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

రాజమహేంద్రవరం రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని బొమ్మూరు మహిళా సంరక్షణ కార్యదర్శి ప్రియాంక అన్నారు. శుక్రవారం బొమ్మూరు వెంకటగిరికొండ అంగన్‌వాడీ కేంద్రంలో 11 నుంచి 18ఏళ్ల వయసున్న బాలికలకు ‘కిశోర వికాసం’ కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రియాంక మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్లు నిండే వరకు వివాహం చేసుకోకూడదన్నారు. బాల్య వివాహాలు ఎవరైనా చేస్తుంటే వెంటనే స్థానికంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు, గ్రామ సచివాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. సదస్సులో అంగన్‌వాడీ కార్యకర్తలు మాధవి, వెంకటలక్ష్మి, మేరీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహిళా సంరక్షణ కార్యదర్శి ప్రియాంక

బోరుబోరుమంటూ..

- 'వైఎస్సార్ జలకళ'కు గ్రహణం
- బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వని వైనం
- అవస్థలు పడుతున్న రైతులు

రాజానగరం: రైతుల సంక్షేమానికి, వారి అభ్యున్నతికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యమిచ్చారు. తన పాలనలో అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. వ్యవసాయాన్ని బంగారంలా మార్చారు. ఆయన ప్రవేశపెట్టిన పథకాలలో వైఎస్సార్ జలకళ ఒకటి. దీని ద్వారా సన్న, చిన్నకారు రైతులకు ఉచితంగా బోర్లు వేయించారు. రాష్ట్రంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే దీని ప్రధాన లక్ష్యం. అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించింది. బోర్లు వేసుకున్న రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం మానేసింది. దీంతో వారందరూ సాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు.

రైతుకు అండగా..

మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరాను ఉచితం చేస్తే, ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి తన ప్రభుత్వ హయాంలో సొంతంగా బోర్లు వేసుకోలేని సన్న, చిన్నకారు రైతులకు ‘వైఎస్సార్ జలకళ’ పథకం ద్వారా ఉచితంగా బోర్లు వేయించే సదుపాయాన్ని కల్పించారు. అర్హులైన రైతులకు ఉచిత బోర్లు వేయాలని ఈ పథకాన్ని రూపొందించారు. దీనితో ఈ పథకం మెట్ట ప్రాంత రైతులకు వరంగా మారింది.

నియోజకవర్గంలో..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లకు అమల్లోకి వచ్చిన ఈ పథకం ద్వారా నియోజకవర్గంలో 126 మంది సన్న, చిన్నకారు రైతులు బోర్లు వేసుకున్నారు. అయితే ఆ తరువాత రాష్ట్రంలో మారిన పాలనా పరంగా వచ్చిన మార్పులతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీనితో సన్న, చిన్నకారు రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్న వైఎస్సార్ జలకళ పథకాన్ని కూడా ఇతర సంక్షేమ పథకాల మాదిరిగానే పాలకులు పక్కన పెట్టారు. ఈ కారణంగా బోర్లు వేసుకుని, విద్యుత్ సదుపాయం లేక ఆయా రైతులు ఏడాది కాలంగా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

వేడుకుంటున్నా..

విద్యుత్ కోసం సంబంధిత అధికారులను రైతులు వేడుకుంటున్నా ఫలితం ఉండడం లేదు. జలకళ పథకమే లేదని, మీకు విద్యుత్ కనెక్షన్ ఎలా ఇచ్చేదని అధికారులు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ కనెక్షన్ కావాలంటే ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజులు చెల్లించాలని చెబుతున్నారు. దీంతో రైతులకు ఏం చేయాలో తెలియడం లేదు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే ప్రక్రియలో భాగంగా కొన్ని చోట్ల స్తంభాలు కూడా వేశారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడం, రాష్ట్రంలో అధికారం మారడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి.



వైఎస్సార్ జలకళ పథకంలో భాగంగా గతంలో సీతారామపురంలో వేసిన విద్యుత్ స్తంభాలు

రైతు సంక్షేమాన్ని విస్మరించారు

రాజానగరం నియోజకవర్గంలో ఎక్కువ మంది రైతులు వ్యవసాయ బోర్లపై ఆధారపడతారు. గతంలో అప్పులు చేసి బోర్లు వేయించుకునేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సహాయంతో అడిగిన ప్రతి రైతుకు వైఎస్సార్ జలకళ పథకంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా బోర్లు వేయించారు. ఇలా కోరుకొండలో 34, రాజానగరంలో 92 బోర్లు వేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు రైతు సంక్షేమాన్ని కూడా విస్మరించింది. దీంతో బోర్లకు ఏడాది కాలంగా విద్యుత్ కనెక్షన్లు మంజూరు కావడం లేదు.

– అడబాల చినబాబు, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం

'జలకళ' అమల్లో లేదు

స్థానిక విద్యుత్ సబ్‌స్టేషను పరిధిలో 29 మంది రైతులు ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజులు కట్టి, విద్యుత్ సర్వీసుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాటిలో కొత్త సర్వీసులకు అవకాశం ఉన్న నాలుగు చోట్ల కనెక్షన్లుఇచ్చాం. మిగిలిన వాటికి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి, అదనపు స్తంభాలను వేయాల్సి ఉంది. ప్రస్తుతం జలకళ పథకం అమలులో లేదు.

– సుధాకర్, ఏఈ, విద్యుత్ సబ్‌స్టేషన్, రాజానగరం

సినిమాలు



శ్యామల : శుభం
సూర్యమినీ : సారంగపాణి జాతకం, బ్లైండ్ స్పాట్
సూర్యప్యాలెస్ : తుదరుమ్
స్వామి : హిట్–3
శివజ్యోతి : హిట్–3
అనుశ్రీ : ఓదెల–2
రాజా : హిట్–3
ఊర్వశి : జగదేకవీరుడు అతిలోకసుందరి
మేనక : అర్జున్ సన్ఆఫ్ వైజయంతి
రంభ : 6 జర్నీ, కామన్ మ్యాన్ పెళ్లాం
కుమారి : సింగిల్
అప్సర : సింగిల్
అశోక : రెట్రో

నామవరం
డీఎస్ మహల్ : హిట్–3

ధవళేశ్వరం
మురళీకృష్ణ : సింగిల్

కడియం
వెంకటసూర్య : హిట్–3